క్లుప్తంగా

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



చేబ్రోలు: తడి, పొడి హానికర చెత్తలను ప్రజలు వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందించే విధంగా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి, అలవాటుగా మార్చాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.పద్మ రాణి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని ఎస్‌డబ్ల్యూ షెడ్‌లో చేబ్రోలు, వట్టిచెరుకూరు, పొన్నూరు మండలాలకు చెందిన సిబ్బందికి 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఘన వ్యర్థాల నిర్వహణపై బ్యాచ్‌ల వారీగా శిక్షణ కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ పద్మరాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పంచాయతీ ప్రథమ కర్తవ్యమన్నారు. కంపెనీలు, దుకాణాలు, ఇళ్ల నుంచి పంచాయతీ సిబ్బంది సేకరించే ఘన వ్యర్థాలతో సంపద తయారు చేసేందుకు చెత్త నుంచి సంపద కేంద్రాలును ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో చెత్త సేకరణలో పాటించవలసిన విధానంపై అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త ప్రాసెసింగ్ విధానం గురించి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.లలిత, గ్రామ సర్పంచ్ ఎ. వినితారాణి, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, తెనాలి డివిజన్ కో–ఆర్డినేటర్ ఎ.రవి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ముగిసిన భగవద్గీత ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీ భగవద్గీత త్రయోదశ అధ్యాయంలోని క్షేత్రజ్ఞ విభాగయోగం ప్రవచనం గురువారం ముగిసింది. జరుబుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో కార్యక్రమం జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచిస్తూ సకల కర్మలు అన్నివిధాలుగా ప్రకృతి ద్వారా జరుగుతున్నాయన్నారు. ఒక్క సూర్యుడే ఈ సమస్త జగత్తును ప్రకాశించునట్లు, ఒకే ఆత్మ సర్వప్రాణులయందు స్థితమై, చైతన్యవంతంగా చేస్తుందని పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురు గురువారం వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో బాటసారుల, పాదచారుల దాహార్తి తీర్చేందుకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశామని అశోక్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఇ.వరప్రసాద్, టీడీపీ నాయకులు కొనకళ్ళ సత్యం, దాతలు మొగిలి సతీష్‌కుమార్, దేవరశెట్టి అప్పారావు, చలివేంద్రం కమిటీ చైర్మన్ గుండా మణిశంకరరావు పాల్గొన్నారు.

గేట్‌లో భాష్యం పూర్వ విద్యార్థికి 25వ ర్యాంక్



ఘంటా హేమంత్

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్–2025) ఫలితాల్లో భాష్యం పూర్వ విద్యార్థి ఘంటా హేమంత్ జాతీయస్థాయిలో 25వ ర్యాంకును సొంతం చేసుకున్నట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో ఐఐటీ రూర్కీ నిర్వహించిన గేట్ పరీక్షల్లో లక్షలాదిమంది ఇంజినీరింగ్ విద్యార్థులు పోటీ పడగా డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డీఏ) విభాగంలో భాష్యం పూర్వ విద్యార్థి జాతీయస్థాయిలో ఆలిండియా 25వ ర్యాంకు సాధించటం ఎంతో గర్వకారణమన్నారు. ఘంటా హేమంత్ పాఠశాల స్థాయి నుంచి భాష్యం విద్యా సంస్థల్లో చదువుకుని, భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ ద్వారా 2021లో ఐఐటీ మద్రాస్ లో సీటు సాధించిన విషయం గుర్తు చేశారు. భవిష్యత్తులో మరెన్నో ఘన విజయాలను హేమంత్ సాధించాలని రామకృష్ణ ఆకాంక్షించారు. ఈ విజయాన్ని సాధించిన హేమంత్‌ను, వారి తల్లిదండ్రులను చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందించారు.

అప్పుడే గొంతెండుతోంది!

- కొండమూదిలో తాగునీటికి కటకట
- కాల్వల నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నిల్వ చేయని అధికారులు
- కాల్వల నుంచి అరకొరగా కొళాయిలకు..
- 31 నుంచి కాల్వలకు ఆగిపోనున్న నీటి సరఫరా
- ఇప్పటికే ఎండిపోయిన స్టోరేజ్ ట్యాంకులు
- తాగేందుకు నీరులేక ప్రజల అవస్థలు
- నిర్లక్ష్య వైఖరిలో అధికార యంత్రాంగం



నీరు లేక ఎండిపోయిన మంచినీటి చెరువు

పొన్నూరు: మండలంలోని కొండమూది గ్రామస్తులను తాగునీటి సమస్య వెంటాడుతోంది. వేసవిలో దాహార్తిని తీర్చే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు ఎండిపోవడంతో నీటి కోసం గొంతెండిపోయే పరిస్థితి నెలకొంది. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక నాలుగు నెలల పాటు నీటి సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజల అవసరాలను తీర్చడంలో సంబంధిత అధికార యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తీవ్రంగా తాగునీటి సమస్య

కొండమూది గ్రామంలో ప్రజల అవసరాల దృష్ట్యా సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు ఉన్నాయి. గ్రామం చుట్టూ సాగు నీటి కాలువ ప్రవహిస్తున్నా ప్రస్తుతం గ్రామంలో ఎండిన చెరువులే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తాగేందుకు గుక్కెడు నీరు లేక అల్లాడిపోతున్నారు. వేసవి దృష్ట్యా వాటిలో సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీటిని నిల్వ చేసి ప్రజా అవసరాలకు వినియోగిస్తుంటారు. చెరువులు నిండి పుష్కలంగా నీరు ఉండటంతో గ్రామస్తులకు తాగునీటికి గతంలో ఎన్నడూ కరువుండేది కాదు. కానీ ఈ ఏడాది తీవ్రంగా తాగునీటి సమస్య ఏర్పడింది. కాలువల ద్వారా నీటిని నిల్వ చేయని కారణంగా చెరువులు ఎండిపోయాయి. ప్రస్తుతం సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీటిని నిల్వ చేసి నేరుగా కొళాయిల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీటి కోసం వేకువజాము నుంచే పడిగాపులు కాస్తున్నారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆ అరకొరగా వచ్చే రంగు మారిన నీరే ప్రజలకు దిక్కవుతోంది. ఈ నెల 31వ తేదీతో సాగునీటి కాలువలకు నీటి సరఫరా నిలిచిపోనుంది. నీరు నిల్వలేని కారణంగా గ్రామంలో పరిస్థితి ఆందోళనకరంగా మారనుంది.



గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకు

గత ప్రభుత్వ హయాంలో సమృద్ధి..

అయితే కొందరు స్వార్థంతోనే తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువుల అభివృద్ధి పేరుతో వాటిని ఎండబెట్టారని చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ట్యాంకర్ల ద్వారా నాలుగు నెలల పాటు నీటిని అందించడం సాధ్యమయ్యేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో లేని నీటి సమస్య.. కూటమి ప్రభుత్వ హయాంలో మాత్రం ఎదురైందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేసే విధంగా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది ..



మా గ్రామంలో నీటి సమస్య తీవ్రస్థాయిలో ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఎన్నడూలేని విధంగా చెరువులు ఎండిపోయాయి. ప్రస్తుతం కాలువల ద్వారా వచ్చే నీటిని వినియోగిస్తున్నాం. ఈ నెల 31 తర్వాత కాలువలు నిలిపి వేస్తే నీటి సరఫరా ఎలా జరుగుతుందో తెలియడం లేదు. ఉన్నతాధికారులు ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలి.

– కోరుకొండ సుధాకర్, గ్రామస్తుడు

ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తాం

చెరువుల అభివృద్ధి కోసం నీటిని నిల్వ చేయలేదు. ఈ నెల చివరి నుంచి కాలువల ద్వారా నీటి సరఫరా గ్రామంలో నిలిచిపోతుంది. ఆ తర్వాత 1210 మంది జనాభా ఉన్న కొండమూది గ్రామంలో రోజుకు 13 ట్యాంకర్ల నీటిని కసుక్రు గ్రామం నుంచి అందించే విధంగా చర్యలు చేపడుతున్నాం. నాలుగు నెలల పాటు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పొన్నూరు

వేడుకగా 'చలపతి మహోత్సవ్'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న చలపతి మహోత్సవ్ గురువారం కొనసాగింది. కార్యక్రమంలో పీపుల్ సొల్యూషన్స్ కాన్సంట్రిక్స్ క్యాటలిస్ట్ సీనియర్ మేనేజర్ డి.సందీప్ మాట్లాడుతూ కళాశాలల్లో వర్క్‌షాపుల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో నాయకత్వ లక్షణాలు మెరుగు పరుచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ 1996లో చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీను స్థాపించామని, ఒక్క స్కూల్‌తో ప్రారంభమై నేడు ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలతో ప్రగతిపథంలో నడుస్తూ ఎందరో విద్యార్థులకు చేయూతనందించటం జరుగుతుందన్నారు. చలపతి విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. కృత్రిమ మేథస్సు, ఆటోమేషన్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికతలో పురోగతి సాధించాలన్నారు. ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు చలపతి విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో రెండు రోజులు వివిధ రకాల టెక్నికల్ ఈవెంట్స్, నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం నలుమూలలనుంచి నలభై ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. నేడు నిర్వహించిన ఐడియాథాన్ పోటీల్లో 16 కళాశాలల నుంచి 67 బృందాలు పాల్గొన్నాయన్నారు. ఈ పోటీల్లో అమరావతి విట్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించగా కేఎల్‌యూ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారన్నారు. పేపర్ ప్రజంటేషన్‌లో ఒంగోలు క్విస్ కళాశాల ప్రథమ స్థానం, ఆర్జేయూకేటీ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారన్నారు. పోస్టర్ ప్రజంటేషన్‌లో ఒంగోలుకు చెందిన ఆర్జేయూకేటీ కళాశాల ప్రథమ స్థానం, క్విస్ కళాశాల ద్వితీయ స్థానం, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో చలపతి కళాశాల ప్రథమ స్థానం, క్విస్ కళాశాల ద్వితీయస్థానం, టెక్నికల్ క్విజ్, కోడింగ్ చాలెంజ్‌లలో చలపతి ప్రథమ, ద్వితీయస్థానాలు కైవశం చేసుకుంది. లోగో డిజైన్‌లో చలపతి ప్రథమ, విజయవాడ ఎన్నారై ద్వితీయ స్థానం, సర్క్యూట్ డి బగ్గింగ్‌లో విజ్ఞాన్ లారా ప్రథమ స్థానం, చలపతి కళాశాల ద్వితీయ స్థానం సాధించారన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల డీన్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, ట్రినీ డీన్ చందు రవిశంకర్, డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, డాక్టర్ నాగగోపి, డాక్టర్ డి.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వపై కార్యదర్శులకు అవగాహన



గుంటూరు రూరల్: భూముల సర్వేపై, గ్రామకంతం హద్దులు నిర్ణయించే స్వామిత్వ కార్యక్రమంపై గురువారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు సర్వేపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు. గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఈఓపీఆర్‌డీ తెలిపారు. కార్యక్రమంలో చిన్నపలకలూరు, దాసుపాలెం, మల్లవరం, జొన్నలగడ్డ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలి

లాం ఫాంలో ముగిసిన విలేజ్ లెవల్ ఎంటర్‌పెన్యూర్‌షిప్



కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నందు గత 15 రోజులుగా జరుగుతున్న విలేజ్ లెవల్ ఎంటర్ పెన్యూర్ సర్టిఫికెట్ కోర్స్ గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, ఎఫ్‌పీవోలకు వ్యవసాయ సంబంధిత సమాచారం, విత్తనం, విత్తనోత్పత్తి, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఇన్‌పుట్స్, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించారు. శాస్త్రవేత్తలతో వివిధ పంటల సాగు వివరాలు, ఎరువుల యాజమానయం, పురుగు మందుల వినియోగం, తెగుళ్ళ యాజమాన్యం, నేల ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయం, జీవనియంత్రణ, జీవన ఎరువులు, జీవరసాయనాలు, డ్రోన్ల వినియోగం వంటి అంశాలపై శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ పొందిన రైతులు వారి పరిజ్ఞానాన్ని ఇతర రైతులకు అందించి, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమం సీఎస్‌సీ కో–ఆర్డినేటర్ సయ్యద్ సైదావలి మాట్లాడుతూ రైతు స్థాయిలో వివిధ పంటల్లో ఎరువులు, పురుగు మందులు వినియోగం ఎక్కువగా ఉందని దాని ప్రభావం వల్ల సాగు ఖర్చు పెరగటంతోపాటు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. అవసరం మేరకు మాత్రమే రసాయన ఎరువులను, పురుగు మందులను వినియోగించాలని సూచించారు. సీఎస్‌సీ స్టేట్ హెడ్ రవికుమార్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రజలకు సీఎస్‌సీ విభాగం సేవలు అందిస్తుందన్నారు. ఇన్‌పుట్ డీలర్స్ వ్యాపార దృక్పదంతోనే కాకుండా సేవా దృక్పథంతో రైతుల సాగు ఖర్చులు తగ్గించే విధంగా ఆలోచన చేయాలన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సేవలు విస్తరణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఏరువాక కేంద్రాలు, కేవీకేల ద్వారా ఎఫ్‌పీవోలకు మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్స్ కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

నెహ్రూనగర్: మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ కోసం గుంటూరు జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి ఎ.భవానీ గురువారం తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు, పదో తరగతి, టీటీసీ, బీఈడీ మార్కులిస్టులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రాజాగారితోటలో బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు చెందినవారు సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 0863–2358071 నంబరులో సంప్రదించాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం



పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ కత్తి పద్మారావు, కమిటీ సభ్యులు

డాక్టర్ కత్తి పద్మారావు

పొన్నూరు: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెండో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ రచయిత, కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో గురువారం అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు డాక్టర్ కత్తి పద్మారావును మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12వ తేదీన నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహవిష్కరణకు పద్మారావును కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం అంబేడ్కర్ జీవిత విశేషాల పుస్తకాలను ఆవిష్కరించారు. పొందుగల అనిల్ బాబు, పోతన ప్రతాప్, రుద్రపాటి రాజశేఖర్, గురిందపల్లి కాంతి కిరణ్, అమృతలూరి క్రాంతి, కె.అమృతరావు, మాధవ్, అక్కిదాసు జాషువా పాల్గొన్నారు.

నేటి నుంచి 'విజ్ఞాన్ నిరులోత్సవ్–2కే25'

- విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి పోటీలు
- రెండురోజుల పాటు జరగనున్న వైనం



నిరులోత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు రోడ్డు నందున్న విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నేటి నుంచి రెండు రోజుల పాటు జాతీయస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ పోటీలు జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై విజ్ఞాన్ నిరులోత్సవ్–2కే25కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటి రోజు శుక్రవారం జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్‌సీహెచ్‌ఈ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్) చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, గౌరవ అతిథిగా ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ టీమ్ లీడ్, విజ్ఞాన్ నిరుల పూర్వ విద్యార్థి నరేడ్ల లావణ్య హాజరవుతారని పేర్కొన్నారు. శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గౌరవ అతిథిగా యాంకర్, విజ్ఞాన్ పూర్వ విద్యార్థి ప్రదీప్ మాచిరాజు హాజరవుతారన్నారు. ఫెస్ట్‌కు సుమారుగా 200 కళాశాలల నుంచి 15 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులతోపాటు డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

45కు పైగా విభాగాల్లో పోటీలు..

జాతీయ ఉత్సవాల్లో భాగంగా మొత్తం 45కు పైగా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా అంశాలను టెక్ ఒడిస్సీ, కల్చరల్ కాస్కేడ్, క్రియేటివ్ కాన్వస్, వర్డ్ సింఫనీ, బిజినెస్ పరేడ్, స్పోర్ట్స్‌ఫెస్ట్ ఇలా ఏడు విభాగాలుగా విభజించినట్లు చెప్పారు. డాన్స్, మ్యూజిక్, థియేటర్ షో, ఫ్యాషన్ వార్, టాలెంట్ హంట్, మైమ్, రీలాథాన్, టీజర్ ట్విస్ట్, డూడుల్ వార్, పేయింటింగ్, మాక్ పార్లమెంట్, యిట్రీ స్లామ్, డిబేట్, షార్ట్ స్టోరీ, బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్, మార్కెట్ మేకర్స్, త్రోబాల్, ఖోఖో, టెన్నికాయిట్, షాట్‌పుట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, చెస్, క్యారమ్స్, 100 మీటర్ల పరుగు పందెం, మిస్ నిరులోత్సవ్, మిస్టర్ నిరులోత్సవ్, టెక్నికల్ క్విజ్, రాపిడ్ కోడ్, రిజిస్టర్ రష్, ఎలక్ట్రో క్రాస్, డబ్‌స్మాష్, సినీ క్వెస్ట్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ఆకర్షణీయ నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన ఉండాలి

ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ



ఉపాధ్యాయిలకు సూచనలు చేస్తున్న ఎంఈఓ కెనడీ

కొండపాటూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి విద్యలో ప్రథమ స్థానంలో నిలిచేవిధంగా ఉపాధ్యాయులు బోధనసాగించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించి ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో ఉండే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా విద్యలో వెనుకపడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. పాఠశాల విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి వారికి విలువలతో కూడిన నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఒకటి నుండి ఎనిమిది తరగతుల విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పెన్నులు అందజేశారు .అనంతరం విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న పథకాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం శీలం అంకారావు,ఉపాధ్యాయులు ఉన్నారు.

ధర లేక డీలా!

- చేబ్రోలు మండలంలో 5500 ఎకరాల్లో అపరాల సాగు
- తగ్గిన మినుము దిగుబడులు
- గిట్టుబాటు ధర లేక ఆందోళన
- గతేడాది కంటే రూ.2వేలు తగ్గిన వైనం



చేబ్రోలు ప్రాంతంలో మినుము నూర్పిడి కోసం పట్టాలపై కుప్పలుగా వేసిన రైతులు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో కొద్ది రోజులుగా మినుము నూర్పిళ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసిన రైతులు రెండో పంటగా మొక్కజొన్న, తెల్లజొన్న, మినుము, పెసర సాగు చేపట్టారు. పంట మార్పిడి వలన దిగుబడులు అధికంగా వస్తాయని అధికారులు చెప్పిన సూచనల మేరకు ఈ మేరకు మండలంలో అపరాల సాగును గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా చేపట్టారు. ఈ ఏడాది చేబ్రోలు మండలంలో 5500 ఎకరాల్లో అపరాల సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని చేబ్రోలు, నారాకోడూరు, తోట్లపాలెం, వడ్లమూడి, శేకూరు, శలపాడు తదితర గ్రామాల్లో మినుము, పెసర పంటలను సాగు చేస్తున్నారు. జొన్న పంటల కంటే, అపరాల సాగుకు ఖర్చు తక్కువ కావటంతో పాటు, గత ఏడాది బహిరంగ మార్కెట్లో ధర ఆశాజనకంగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు అపరాల సాగుకు మొగ్గు చూపారు. ప్రస్తుతం మినుము పీకుడు, నూర్పిళ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పీకుడు పనుల తరువాత రైతులు యంత్రాల సహాయంతో నూర్పిళ్లు చేస్తున్నారు.

మండలంలో సాగు వివరాలు..

మినుము 3600 ఎకరాల్లో, పెసర 1900 ఎకరాల్లో, మొక్కజొన్న 3700 ఎకరాల్లో, తెల్లజొన్న 2500 ఎకరాల్లో రబీలో రైతులు సాగు చేస్తున్నారు.

దిగుబడి, గిట్టుబాటు ధర్పై ఆందోళన..

మినుము ఈ ఏడాది దిగుబడి తగ్గటంతో పాటు ధర పతనం కావటంతో రైతులు డీలా పడుతున్నారు. ఎకరానికి సగటున 4 నుంచి 6 బస్తాల వరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గత ఏడాది 8 నుంచి 10 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో మినుముల ధర పతనం కావటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మినుము క్వింటా రూ.7300లకు, పెసర క్వింటా రూ.7100లకు వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కన్నా మినుము, పెసర ధరలో రూ.2వేల వరకు వ్యత్యాసం ఉండటంతో పాటు నాలుగు బస్తాల వరకు దిగుబడి తగ్గటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలో వచ్చిన నష్టాన్ని రెండో పంటగా సాగు చేసిన అపరాలతో లాభాలు పొందవచ్చునని ఆశించిన రైతులకు ప్రస్తుత పరిస్థితి మింగుడు పడని విధంగా మారింది.

ఏఎన్‌యూలో అంతర్జాతీయ సంతోష దినోత్సవం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలం సైకాలజీ విభాగంలో అంతర్జాతీయ సంతోష దినోత్సవం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూవర్సిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ రమణమూర్తి పాల్గొన్నారు. ఆయన అంతర్జాతీయ సంతోష దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. సంతోషంగా ఉండటం వల్ల కలిగే శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సమతుల్యానికి, సామాజిక ఆనందానికి, ప్రశాంతతకు, అభివృద్ధికి సంతోషం ఏవిధంగా దోహదం చేస్తుందో వివరించారు. సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజలు నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జీవనం, ఏవిధంగా సంతోషానికి దోహదం చేస్తుందో వివరించారు. ఆచార్య టి.డి.విమల మాట్లాడుతూ అంతర్జాతీయ సంతోషదినం ఆవిర్భావానికి కారణాలు వివరించారు. ఆనందమైన ఉద్వేగాలతో నిండిన జీవితం, అర్థవంతమైన జీవితం, మన శక్తి సామర్థ్యాలు సంపూర్ణంగా ఉపయోగించుకుంటే సంతోషమనేది వస్తుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. సైకాలజీ విభాగ అధ్యాపకులు అనుమ, ప్రమీలరాణి, కె.కృష్ణమోహన్, కె.శాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.